ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
శుక్రవారం 18 ఏప్రిల్ 2025



22న జడ్పీ స్థాయీసంఘ సమావేశాలు

అరసవల్లి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): జిల్లాపరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు ఈ నెల 22న నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈవో శ్రీధర్ రాజా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ఈ నెల 22న ఉదయం 10.30 గంటలకు స్థాయీ సంఘం సమావేశాలు ప్రారంభమవుతాయి. ముందుగా 1,2,4,7 స్థాయీ సంఘ సమావేశాలు, మధ్యాహ్నం 4గంటలకు 3వ, సాయంత్రం 5 గంటలకు 5వ స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించనున్నామ'ని జడ్పీ సీఈవో శ్రీధర్ రాజా తెలిపారు.

ఎండిపోయాయ్!

- ఎడారిలా నాగావళి, వంశధార నదులు
- నీరులేక ప్రజలకు తప్పని ఇబ్బందులు



హిరమండలంలో గొట్టాబ్యారేజీ వద్ద నీరు లేక.. బీడు వారి..

శ్రీకాకుళం/ హిరమండలం/ గార/ కొత్తూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి):

జిల్లాలోని ప్రధాన నదులు నాగావళి, వంశధార వేసవి ఆరంభంలోనే అడుగంటిపోతున్నాయి. ఎండ తీవ్రత కారణంగా.. కొద్దిపాటి నీటితో పిల్లకాలువల్లా కనిపిస్తున్నాయి. శ్రీకాకుళంలోని నాగావళి నది ద్వారా జిల్లాలో పలు గ్రామాల ప్రజలకు తాగునీరందుతుంది. మూగజీవాలు, పక్షుల దాహం కూడా ఈ నది తీర్చేది. ప్రస్తుతం నది నీరులేక ఎడారిని తలపిస్తోంది. రానున్న కొద్దిరోజుల్లో ఎండల తీవ్రతకు మరింత నీటి ఎద్దడి ఎదురు కానుందని ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. నగరంలోని మురుగునీరు నదిలో పారుతుండడంతో.. అందులోనే పశువులు సేదతీరుతున్నాయి.

గొట్టా బ్యారేజీ.. డెడ్ స్టోరేజీ

శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని సుమారు ఏడు మండలాల పరిధిలో వంశధార నది ప్రవహిస్తోంది. రెండున్నర లక్షలకుపైగా సాగునీటితోపాటు తాగునీటి అవసరాలను తీరుస్తున్న వంశధార నది కూడా వెలవెలబోతోంది. ప్రస్తుతం నదిలో నీటి ప్రవాహం లేక హిరమండలంలోని గొట్టాబ్యారేజీ వద్ద నీటి నిల్వ డెడ్ స్టోరేజీకి చేరుకుంది. బ్యారేజీ ఎగువ ప్రాంతమంతా ఇసుక మేటలు కనిపిస్తున్నాయి. ఇన్‌ఫ్లో పూర్తిగా పడిపోయింది. ఇప్పటికే బ్యారేజీ దిగువన ఉన్న హిరమండలం రక్షిత నీటి పథకానికి నీరు అందక ఇబ్బందులు ప్రజలు ఇబ్బందులు పాడుతున్నారు. అలాగే గార మండలంలోని బూరవెల్లి నుంచి కళింగపట్నం వరకూ ప్రవహించే వంశధార నది అడుగంటిపోయింది. నదీ తీర గ్రామాల్లో బావులు, కుళాయిలు, వ్యవసాయ పంపుసెట్లలో భూగర్భజలాలు బాగా తగ్గిపోయాయి. కొత్తూరు మండల పరిధిలో కూడా వంశధార నదిలో నీటి నిల్వలు తగ్గి.. ఇసుక మేటలే కనిపిస్తున్నాయి. దీంతో నదీ తీరప్రాంత ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. ఈ వేసవి ఎలా గట్టెక్కుతుందోనని ఆందోళన చెందుతున్నారు.

రిజర్వాయర్‌లోనూ అంతే..

గతేడాది వర్షాలు ఆశించినస్థాయిలో లేకపోవడంతో హిరమండలం వద్ద వంశధార రిజర్వాయర్‌లో నీటి నిల్వ అడుగంటింది. రిజర్వాయర్‌లో 8 టీఎంసీలు నిల్వచేసే అవకాశం ఉంది. కానీ వంశధార నదికి వరదలు లేకపోవడం, కొండ ప్రాంతాల నుంచి కూడా నీరు చేరకపోవడంతో ఈ ఏడాది సుమారు 5 టీఎంసీల వరకు నీరు చేరింది. గొట్టాబ్యారేజీ వద్ద నీటి నిల్వ తక్కువగా ఉండటంతో మార్చి నెల మొదటి వారం వరకు రిజర్వాయర్ నుంచి వంశధార కుడి కాలువకు నీటిని విడిచిపెట్టారు. దీంతో రిజర్వాయర్‌లో నీరు అడుగంటింది. ప్రస్తుతం 0.5టీఎంసీ మాత్రమే నిల్వ ఉందని వంశధార ఈఈ ఎం.వి.రమణమూర్తి తెలిపారు. వంశధార రిజర్వాయర్‌తోపాటు గొట్టాబ్యారేజీ వద్ద నీరు అడుగంటిపోవడంతో ఈ ఏడాది వర్షాలు కురిసే వరకు సాగు, తాగునీటి అవసరాలకు ఇబ్బందులు తప్పవని అధికారులు చెబుతున్నారు.



శ్రీకాకుళం పాత వంతెన వద్ద నీరు లేని నాగావళి నది



కొత్తూరు మండలం వసప వద్ద వంశధార నది ఇలా..



గార వద్ద అడుగంటిన వంశధార నది

కేంద్రమంత్రికి మరో గుర్తింపు

- వరల్డ్ ఎకనామిక్ ఫోరం గ్లోబల్ యంగ్ లీడర్ జాబితాలో రామ్మోహన్‌నాయుడు పేరు



శ్రీకాకుళం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడుకి మరో అరుదైన గుర్తింపు లభించింది. వరల్డ్ ఎకనామిక్ గ్లోబల్ యంగ్ లీడర్ జాబితా- 2025లో కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు పేరును వరల్డ్ ఎకనామిక్ ఫోరం చేర్చింది. ఈ జాబితాలో టెక్ వ్యవస్థాపకుల నుంచి మానవ హక్కులు.., న్యాయవాదుల నుంచి ప్రపంచ వ్యాప్తంగా తమ రంగాల్లో ఉత్తమ నాయకత్వం కనబరిచిన యువ నాయకులు ఉన్నారు. భారతదేశం నుంచి మొత్తం ఏడుగురికి ఎంపిక చేయగా.. అందులో జిల్లాకు చెందిన రామ్మోహన్‌నాయుడు ఉండడం గర్వకారణం.

- 26 ఏళ్లకే ఎంపీగా..

2014లో అతి చిన్నవయసులో 26 ఏళ్లకే పార్లమెంట్ సభ్యుడిగా రామ్మోహన్ నాయుడు ఎన్నికయ్యారు. 2024 ఎన్నికల్లోనూ వరుసగా మూడోసారి ఎంపీగా గెలిచారు. ప్రధాని నరేంద్రమోదీ మంత్రివర్గంలో అతి చిన్న వయసులో కేబినేట్ మంత్రిగా కొనసాగుతున్నారు. ఆయన రాజకీయ ప్రయాణం యువతకు స్ఫూర్తిదాయకం. ఆయన నాయకత్వంలో పౌర విమానయాన మంత్రిత్వ శాఖ కొత్త శక్తిని పొందింది. విమాన ప్రయాణాన్ని అందుబాటులోకి తీసుకురావడానికి, మౌలిక సదుపాయాలను ఆధునీకరించడానికి ఆయన కృషి చేశారు. ఉడాన్ కనెక్టివిటీని మారుమూల ప్రాంతాలకు విస్తరించడానికి, డిజిటల్ ఆవిష్కరణలతో విమానయాన పరిశ్రమ అభివృద్ధికి సంస్కరణలు చేశారు. ప్రపంచ గుర్తింపు కలిగిన భారతీయులు జ్యోతిరాదిత్య సింధియా, సచిన్ పైలెట్, ఇటీవల రితేష్ అగర్వాల్‌తో పాటు ఆ జాబితాలో రామ్మోహన్‌నాయుడు కూడా చేరడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

- దీనిపై కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు స్పందిస్తూ.. 'వరల్డ్ ఎకనామిక్ ఫోరం ద్వారా యంగ్ గ్లోబల్ లీడర్‌గా ఎంపిక కావడం గొప్ప గౌరవంగా భావిస్తున్నాను. ఈ గుర్తింపు నా ఒక్కడిదే కాదు. ముఖ్యమైన నిర్ణయాలు తీసుకునే స్థానంలో భారత యువత ప్రాధాన్యం పెరుగుతుంద ని ఇది సూచిస్తోంది. నిజాయితీ, నూతన ఆలోచనలు, సమగ్రతతో ప్రజలకు సేవ చేయాలనే బాధ్యతను మరింత గుర్తు చేస్తుంది' అని తెలిపారు.

పలాసకు ఉద్దానం నీరు

- 15 రోజుల్లో ఇచ్చేందుకు శరవేగంగా పనులు

ఒక చిన్న ఆలోచన మునిసిపాలిటీకి రూ.కోట్లు పొదుపు చేసినట్లయింది. కేవలం రూ.63లక్షల వ్యయంతో పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటిలోని 31 వార్డులకు తాగునీరు ఇచ్చేందుకు మార్గం సుగమమైంది. దీనికి సంబంధించిన పనులు శరవేగంతో సాగుతున్నాయి. 15 రోజుల్లో ట్రయల్ రన్ నిర్వహిస్తామని ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు.



ఉద్దానం తాగునీటి పథకం

పలాస, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి):

పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ ప్రజలకు త్వరలో ఉద్దానం తాగునీరు అందనుంది. వేసవి వచ్చిందంటే చాలు.. మునిసిపాలిటీలో తాగునీటి కష్టాలు ప్రారంభమయ్యేవి. శాశ్వత మంచినీటి పథకాలు ఏవీ లేకపోవడంతో స్థానికంగా ఉండే నీటి వనరులపై ఆధారపడాల్సి వచ్చేది. ఏటా వేసవిలో తాగునీరు సరఫరాకే రూ.40లక్షల వరకూ వెచ్చిస్తున్నారు. ఈ పరిస్థితిని గుర్తించిన టీడీపీ ప్రభుత్వం (2014-19 మధ్య) ఆఫ్‌షోర్ ఆధారిత మంచినీటి పథకానికి శ్రీకారం చుట్టి రూ.100కోట్లు ఇచ్చేందుకు అంగీకరించింది. అయితే రిజర్వాయర్ పనులు నిలిచిపోవడంతో ఆ ప్రతిపాదన వెనక్కి మళ్లిపోయింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో సమగ్ర మంచినీటి పథకాన్ని ప్రారంభించారు. పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాలకు వంశధార నీటిని హిరమండలం వద్ద స్లంప్ నిర్మించి గ్రావిటీ ద్వారా నీరు సరఫరా చేస్తున్నారు. అయితే పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీని అందులో చేర్చకపోవడంతో ఆ నీరు రావడం లేదు. మునిసిపాలిటీ మీదుగా అంతర్గత పైపులైన్ల ద్వారా నీరు ఇచ్ఛాపురం వైపు వెళ్తున్నా ఆ నీటికి తీసుకురావడానికి అనేక అవరోధాలు ఏర్పడ్డాయి. దీంతో మునిసిపాలిటీకి తాగునీటి సరఫరా కలగా మిగిలింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఈ సమస్యపై స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీష దృష్టి పెట్టారు. రాష్ట్ర ప్రభుత్వం, పట్టణాభివృద్ధి శాఖమంత్రి కె.నారాయణ దృష్టికి ఈ సమస్య తీసుకెళ్లారు. కనీసం సగం నీరయినా ఇవ్వాలని కోరినా సాంకేతిక ఇబ్బందుల వల్ల ఆ పని సాధ్యం

(మిగతా 7వ పేజీలో..)



ఉద్దానం తాగునీటి పథకం అనుసంధానానికి వేస్తున్న పైపులైన్లు

సహకార రంగాన్ని బలోపేతం చేయాలి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్

శ్రీకాకుళం కలెక్టరేట్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): సహకార రంగం బలోపేతానికి అన్ని శాఖల సమన్వయం అవసరమని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. గురువారం జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా 12 విభాగాల అధిపతులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన సహకార నామ సంవత్సరం కార్యక్రమాల అమలుపై కార్యాచరణను రూపొందించాలని సూచించారు. 'ప్రజల భాగస్వామ్యంతో జిల్లాలో ప్రతినెలా సహకార రంగంపై అవగాహన కార్యక్రమాలు, శిక్షణలు, రికవరీ డ్రైవ్‌లు నిర్వహించాలి. పీఏసీఎస్ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు సహకార శ్రేణుల మధ్య అవగాహన పెంపుపై దృష్టి సారించాలి. రైతులకు, చిరు వ్యాపారులకు, మహిళా సంఘాలకు అందే రుణ సౌకర్యాలు, డ్రాయింగ్ లిమిట్స్ పెంపు, మద్దతు ధరలు తదితర అంశాలపై శాఖల సమన్వయంతో కార్యాచరణ రూపొందించాల'ని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా సహకార అధికారి నగేష్, జడ్పీ సీఈవో శ్రీధర్ రాజా, వ్యవసాయధికారి త్రినాథస్వామి, ఆహార, పౌరసరఫరాల శాఖ, పశు సంవర్థక శాఖ, మత్స్యశాఖ, డీసీసీబీ ఎండీ, నాబార్డు డీడీఎం, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమాచారం

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశానికి దరఖాస్తులు

గుజరాతీపేట, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అనాథలు, హెచ్ఐవీ బాధితులు, విభిన్న ప్రతిభావంతులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీ వర్గాల పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు డీఈవో తిరుమల చైతన్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని ప్రైవేటు పాఠశాలల్లో ఈ నెల 19 నుంచి 26వరకు ఆన్‌లైన్ పోర్టల్ నందు నమోదు చేసుకోవాలన్నారు. తర్వాత ఈ నెల 28 నుంచి మే 15 వరకు అన్ని వర్గాల పిల్లలు ప్రవేశం పొందడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తామన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, సంబంధిత గ్రామ సచివాలయం, మండల విద్యావనరుల కేంద్రం, సంబంధిత పాఠశాల నుంచి దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. అర్హులైన విద్యార్థులకు లాటరీ ద్వారా సీట్లు కేటాయిస్తామని తెలిపారు.

సీనియారిటీపై అభ్యంతరాలు తెలియజేయండి

గుజరాతీపేట, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): 'జిల్లాలో అర్హులైన ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించేందుకు తొలివిడతలో వచ్చిన అభ్యంతరాలను పరిశీలించాం. ఎస్టీటీ, పీఈటీ, తత్సమాన కేటగిరిల్లో సీనియారిటీ జాబితాను జిల్లా విద్యాశాఖాధికారి వెబ్‌సైట్‌లో పొందపర్చామ'ని డీఈవో ఎస్.తిరుమల చైతన్య తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ, జిల్లాపరిషత్, మున్సిపల్ పాఠశాలల్లో ఉపాధ్యాయుల అర్హతను బట్టి సీనియారిటీ జాబితాపై అభ్యంతరాలు ఉంటే.. ఈ నెల 21వ తేదీలోగా డీఈవో కార్యాలయానికి తెలియజేయాలని సూచించారు.



బొరిగివలస ఉపాధిహామీ కూలీలకు ప్రభుత్వ పాఠశాలలపై అవగాహన కల్పిస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు

భవిష్యత్తుకు మాది భరోసా

- ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించండి
- జోరుగా ఉపాధ్యాయుల ప్రచారం

నరసన్నపేట, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల బలోపేతంపై రాష్ట్ర సర్కారు దృష్టి సారించింది. వైసీపీ పాలనలో అస్తవ్యస్త నిర్ణయాలతో విద్యావ్యవస్థ గాడి తప్పింది. ప్రధానంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య బాగా పడిపోయింది. ఈ నేపథ్యంలో పలు సంస్కరణలకు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ శ్రీకారం చుట్టారు. ప్రైవేటు, కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు కల్పిస్తున్నట్టు ఇటీవల పలు సందర్భాల్లో ప్రకటించారు. విద్యార్థుల సంఖ్య పెంచేలా ప్రచారం నిర్వ హించాలని ఆదేశాలు జారీచేశారు. ఈ నేప థ్యంలో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు.. ఊరూరా పర్యటిస్తూ జోరుగా ప్రచారం చేస్తు న్నారు. ప్రతీ గ్రామంలోనూ పర్య టిస్తూ గ్రామ పెద్దలు, పొదుపు సంఘాల మహి ళలు, ఉపా ధిహామీ కూలీల వద్దకు కూడా వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని కోరుతున్నారు. ఎంఈవోలు కూడా క్షేత్రస్థాయిలో పర్యటించి.. మరింత అవగాహన కల్పిస్తున్నారు. 'మీ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించండి. మీ పిల్లల భవిష్యత్‌కు బాటలు వేస్తామ'ని భరోసా ఇస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కలిగే ప్రయోజనాలను వివరిస్తున్నారు. దీంతో తల్లిదండ్రుల్లో నమ్మకం పెరిగి.. చాలా మంది ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించేందుకు ఆసక్తి చూపుతున్నారు.

లక్ష్యానికి.. అంగన్‌వాడీల తూట్లు

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు అంగన్‌వాడీ, డీఆర్‌డీఏ, గ్రామపంచాయతీ ఉద్యోగుల సమన్వయంతో డ్రైవ్‌ను క్లస్టర్ హెచ్ఎంలు నిర్వహించాలని ప్రభుత్వం ఇటీవల ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం పీపీ1, పీపీ2 చదువుతున్న చిన్నారుల డేటాను అంగన్‌వాడీ కార్యకర్తలు సేకరించి.. ఆ చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతిలో చేరేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. కానీ కొన్ని గ్రామాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఇచ్చే తాయిలాలకు లొంగిపోయి.. ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పొడుస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ప్రైవేటు పాఠశాలల్లో చిన్నారులను చేర్పించాలని తల్లిదండ్రులపై వారు ఒత్తిడి చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇటువంటి వారిపై ఆ శాఖ ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

పేదల ఆకలి తీర్చడమే లక్ష్యం

- గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తాం
- ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామీణ రహదారులు ఛిద్రం
- మంత్రి అచ్చెన్నాయుడు

6లో

గోకులం బిల్లులకు మోక్షమెప్పుడో?

- పట్టించుకోని అధికారులు
- ఎదురుచూస్తున్న లబ్ధిదారులు

7లో

రేపటి నుంచి పంచకుండాత్మక యజ్ఞం

6లో

రైతులకు వరం.. పశు బీమా

- పశువులు, మేకలు, గొర్రెలకు బీమా అమలు
- నామమాత్రపు ప్రీమియంతో భారీ ప్రయోజనం
- ఒకసారి చెల్లిస్తే మూడేళ్ల కాలానికి అమలు

6లో



ఒకటే గమ్యం.. ఒకటే గమనం

● డీఎస్సీ కోసం అభ్యర్థుల సన్నద్ధం


శ్రీకాకుళం గ్రంథాలయంలో చదువుకుంటున్న యువత

'గెలుపు పొందు వరకూ అలుపు లేదు మనకు'

అన్న ఓ సినీ కవి మాటలను నిరుద్యోగులు అక్షరాలా పాటిస్తున్నారు. త్వరలో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ రానుండడంతో ఎలాగైనా ఉపాధ్యాయ ఉద్యోగం సంపాదించాలనే లక్ష్యంతో ముందుకెళుతున్నారు. పగలూ.. రాత్రీ తేడా లేకుండా కష్టపడుతున్నారు. కొందరు ఏకాంతంగా పుస్తకాల ప్రపంచంలో మునిగిపోతుండగా.. మరికొందరు గ్రూప్ డిస్కషన్స్ పెట్టుకుంటూ సబ్జెక్టుపై పట్టు సాధించే ప్రయత్నం చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని కేంద్ర గ్రంథాలయంలో రోజంతా ఉద్యోగార్థులు ఇలా పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. వివిధ ప్రాంతాల నుంచి ఉదయాన్నే ఇక్కడికి చేరుకుంటున్న విద్యార్థులు.. రోజంతా ఇక్కడే చదువుతూ గడుపుతున్నారు.

-శ్రీకాకుళం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి)


కాసేపు కునుకు తీద్దాం..


అమ్మాయిలంతా కలసి కట్టుగా...


నోట్స్ తయారు చేసుకుంటూ..


శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి అచ్చెన్నాయుడు

పేదల ఆకలి తీర్చడమే లక్ష్యం

● గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తాం

● ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామీణ రహదారులు ఛిద్రం ● మంత్రి అచ్చెన్నాయుడు

టెక్కలి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పేదల ఆకలి తీర్చడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. గురువారం టెక్కలి ఇందిరాగాంధీ కూడలిలో రూ.61 లక్షలతో తలపెట్టిన అన్నా క్యాంటీన్ నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నా క్యాంటీన్ అందరికీ ఆకలి తీరుస్తుందని తెలిపారు. అనంతరం లింగాలవలస గ్రామంలో సీసీ రోడ్లు, ప్రాథమికఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో గ్రామీణ రోడ్లు ఛిద్రమయ్యాయని, కనీస మరమ్మతులు చేపట్టలేదని ఆరోపించారు. గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. రాష్ట్రంలో మల్టీస్పెషాల్టీ ఆసుపత్రి నిర్మాణానికి కూడా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అనంతరం లింగాలవలసలో పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యకర్తలే పార్టీకి పునాదులని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, కింజరాపు హరిప్రసాద్, బగాది శేషగిరి, పినకాన అజయ్‌కుమార్, ఎల్ఎల్ నాయడు, చౌదరి బాబ్జీ, హనుమంతు రామకృష్ణ, లవకుమార్, రాము, సంపతిరావు రాఘవరావు, సంపతిరావు రవీంద్ర, వివిధ శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

రైతులకు వరం.. పశు బీమా



● కొన్నాళ్ల కిందట శ్రీకాకుళం రోడ్డు - కోటబొమ్మాళి రైల్వే స్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొన్న ప్రమాదంలో సుమారు 60 గొర్రెలు మృతిచెందాయి. గొర్రెల పెంపకందారులు ఎంతగా ఆందోళన వ్యక్తం చేసినా అప్పటి ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా సాయం అందలేదు. సుమారు రూ.3 లక్షల నష్టం వాటిల్లడంతో ఆ రైతులు కుదేలైపోయారు.

● 2023 మేలో లావేరు మండలంలో పిడుగుపాటుకు పొలాల్లో ఉన్న రెండు బర్రెలు మృతిచెందాయి. వీటి విలువ సుమారు రూ.1.50 లక్షలు ఉంటుంది. అప్పట్లో పశుబీమా అమలు చేయకపోవడంతో రైతు నష్టపోయారు. ఇలా గత ప్రభుత్వ హయాంలో జిల్లాలో అనేక ప్రమాదాల్లో వందల సంఖ్యలో పశువులు మృతిచెందాయి. పాడిరైతులకు రూ.లక్షల్లో నష్టం వాటిల్లింది. ఇలాంటి నష్టం జరగకుండా పాడి రైతులను ఆదుకునేందుకు ప్రస్తుత ప్రభుత్వం మళ్లీ పశుబీమా పథకాన్ని అమలు చేస్తోంది.

● పశువులు, మేకలు, గొర్రెలకు బీమా అమలు

● నామమాత్రపు ప్రీమియంతో భారీ ప్రయోజనం

● ఒకసారి చెల్లిస్తే మూడేళ్ల కాలానికి అమలు

నరసన్నపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి):

పాడి పరిశ్రమ అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ప్రమాదవశాత్తూ మూగజీవాలు మృత్యువాత పడితే.. సంబంధిత కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవడానికి గతంలో ఉన్న పశుబీమా పథకాన్ని పునః ప్రారంభించింది. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు పశుబీమా ద్వారా ఎంతో మంది రైతులను ఆదుకున్నారు. వైసీపీ పాలనలో ఈ పథకం నిర్వీర్యమైంది. పశువులను కోల్పోయిన రైతులు బీమా రాక ఎన్నో ఇబ్బందులు పడ్డారు. మళ్లీ పశుబీమా పథకాన్ని ప్రారంభించడంతో పాడిరైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న ఒక కుటుంబానికి ఐదు పశువుల వరకు బీమా వర్తిస్తుంది. ఒకసారి ప్రీమియం చెల్లిస్తే మూడేళ్ల వరకు మళ్లీ చెల్లించాల్సిన అవసరం లేదు. జిల్లాలో 3,75,345 ఆవులు, గేదెలు, 45,914 దూడలు, 7,19,985 గొర్రెలు, మేకలు ఉన్నాయి. వీటిని సుమారు 4.5 లక్షలు మంది పాడి రైతులు పోషిస్తున్నారు. ఈ పథకం పాడి రైతులకు వరం అని చెప్పవచ్చును. జిల్లాలో 92 పశుకేంద్రాలు లేదా 358 రైతు సేవా కేంద్రాల్లో బీమా పొందేందుకు పాడిరైతులు సంప్రదించవచ్చును.

ప్రీమియంపై రాయితీ..

బీమా ప్రీమియంలో రాష్ట్ర ప్రభుత్వం భారీ రాయితీ ఇస్తోంది. మూడేళ్ల కాలం ఉండే బీమాకు 85శాతం రాయితీ ఇస్తోంది. రూ.15వేల బీమాకు ప్రీమియం రూ.960 చెల్లించాల్సి ఉంది. ఇందులో ప్రభుత్వ రాయితీ రూ.768 పోను రైతు వాటాగా రూ.192 చెల్లించాలి. రూ.30వేల బీమాకు ప్రీమియం రూ.1,920, ప్రభుత్వం రూ.1,536 చెల్లిస్తుంది. రైతు వాటా కింద రూ.384 చెల్లించాలి. అలాగే రూ.40వేల బీమాకు ప్రీమియం రూ.2,560 అవుతుంది. దీనిలో ప్రభుత్వం రూ.1,536, రైతు వాటా రూ.1,024 చెల్లించాల్సి ఉంటుంది. గొర్రెలు, మేకల పెంపకందారులకు ఒక కుటుంబానికి సంవత్సరానికి 50 జీవాల వరకు బీమా వర్తిస్తుంది. 6 నెలలు, ఆపై వయస్సు కలిగిన గొర్రెలు, మేకలకు రూ.6వేల వరకూ బీమా వర్తిస్తుంది. పెంపకందారులు సంవత్సరానికి రూ.36 ప్రీమియం చెల్లిస్తే సరిపోతుంది. పశుపోషకులు, గొర్రెలు, మేకల పెంపకదారులు దగ్గర్లో ఉన్న పశువైద్యశాలలో బీమా చేయించుకోవచ్చు. బీమా ప్రీమియం చెల్లించిన పశువు చెవికి ట్యాగ్ వేస్తారు. పశువు చనిపోయినప్పుడు చెవి ట్యాగ్ అధారంగా బీమా చెల్లిస్తారు.

నిబంధనలు ఇవే...

బీమా కావాలనుకునే రైతులు బ్యాంకు ఖాతా పుస్తకం, ఆధార్ కార్డు, ఎస్సీ, ఎస్టీలైతే రేషన్ కార్డు జిరాక్స్ కాపీలను జత చేయాలి. పశువులు మృతిచెందిన వెంటనే సమీపంలోని రైతు సేవ సిబ్బందికి సమాచారం ఇవ్వాలి. బీమా సర్వే సిబ్బంది వచ్చే వరకు పశువులకు వేసిన ట్యాగ్‌ను తొలగించకుండా ఉండాలి. బీమా చేసిన పశువులను విక్రయిస్తే ఏడు రోజుల్లోగా కంపెనీ వారికి తెలియజేసి కొనుగోలుదారుడి పేరుపైన మార్చాలి. ఈ నిబంధనలపై సంబంధిత అధికారులు గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నారు.

అవగాహన కల్పించాలి..



పశువులకు బీమా సౌకర్యంపై గ్రామీణ ప్రాంతాల్లో పాడిరైతులకు అవగాహన కల్పించాలి. గతంలో రైతులు ప్రీమియం చెల్లించినా పరిహారం అందలేదు. దీని వల్ల ఈ పథకంపై నమ్మకం లేకుండాపోయింది. అందుకే రైతులు బీమా చెల్లించేందుకు వెనుకంజ వేస్తున్నారు.

-సూరప్ప నారాయణదాసు, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ మాజీ డైరెక్టర్ పోలాకి మండలం

సద్వినియోగం చేసుకోవాలి



పశుబీమాపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రతి రైతు తమ పాడి పశువులకు బీమా చేసుకునేలా అవగాహన కల్పించి, ట్యాగులు వేసుకునేలా చేస్తున్నాం. ప్రభుత్వం అందించే రాయితీలు, ఉపయోగాలను సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తున్నాం.

-రాజగోపాలరావు, జేడీ, పశుసంవర్థకశాఖ, శ్రీకాకుళం

ఈవీఎంలు ఎంత భద్రం?

● తనిఖీ చేసిన అధికారులు


ఈవీఎం గోదాముల రికార్డులు పరిశీలిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కలెక్టరేట్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఈవీఎంల భద్రతా ఏర్పాట్లపై ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మాసాంతపు తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో కలెక్టరేట్‌లోని ఈవీఎం గోదాములను రాష్ట్ర ఎన్నికల కమిషన్ డిప్యూటీ సీఈవో కె.విశ్వేశ్వరరావు గురువారం తనిఖీ చేశారు. గోదాంలో అమలులో ఉన్న ట్రిపుల్ లాక్ విధానం, 24 గంటల సీసీ టీవీ పర్యవేక్షణ, భద్రతా తీరు, సిబ్బంది విధులు, హాజరుపై ఆయన సమీక్షించారు. రికార్డుల నిర్వహణ తీరును పరిశీలించారు. భద్రతా పరంగా చేపట్టాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు సూచనలిచ్చారు. ఈ తనిఖీలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వేంకటేశ్వరరావు, ఎన్నికల విభాగం అధికారులు, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు. ఇదిలా ఉండగా జిల్లాకు వచ్చిన డిప్యూటీ సీఈవో విశ్వేశ్వరరావు అరసవల్లిలోని ఆదిత్యుడిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు.

అగ్గిపుల్లపై జీసస్



కాశీబుగ్గ 21వ వార్డుకు చెందిన కళాకారుడు కొత్తపల్లి రమేష్ ఆచారి గురువారం అగ్గిపుల్లపై సూక్ష్మ జీసస్‌ను రూపొందించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి అతుకులు లేకుండా కేవలం 100 మిల్లీ గ్రాముల బంగారంతో దీనిని రూపొందించినట్టు చెప్పారు. దీని ఎత్తు ఒక సెంటీమీటర్, వెడల్పు ఒక సెంటీమీటర్ ఉందన్నారు.

-కాశీబుగ్గ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి)


సిద్ధమైన యాగశాల

రేపటి నుంచి పంచకుండాత్మక యజ్ఞం

● నేడు జలయాత్ర

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): బెల్లుపడ గ్రామంలో ఈనెల 19 నుంచి 23 వరకు త్రిదండి శ్రీమన్నారాయణ చిన్న జీయర్ స్వామి ఆధ్వర్యంలో శ్రీరామ తారక మహామంత్ర సహిత పంచ కుండాత్మక యజ్ఞాన్ని నిర్వహించనున్నారు. దీని కోసం గ్రామస్తులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇందులో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం జలయజ్ఞ శోభాయాత్రను నిర్వహించనున్నారు. హరినామ సంకీర్తనలతో ఈ యాత్ర నిర్వహించనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. 19 నుంచి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, అంకురారోపణ, మండప ఆవాహనం, అగ్ని ప్రతిష్ఠ తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు గ్రామపెద్దలు, కమిటీ సభ్యులు తెలిపారు.


మహావిష్ణువు ఆలయంలో అలంకరణ

బంగారు తెరలా... ఆకాశం మెరిసెనిలా!

వేంకటేశ్వరుని దర్శనానికి సూరీడు వచ్చినట్టు ఓవైపు... కొండ చుట్టూ బంగారు తెరను కట్టినట్టు మరోవైపు... పసుపు వర్ణంతో ఆకాశం తళుకులీనింది. గురువారం సూర్యోదయ సమయాన పలాసలోని నెమలికొండ వద్ద ఈ దృశ్యం కనువిందు చేసింది.

-పలాస, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి)



గోకులం బిల్లులకు మోక్షమెప్పుడో?

- పట్టించుకోని అధికారులు
- ఎదురుచూస్తున్న లబ్ధిదారులు

సరుబుజ్జిలి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ అనుబంధ రంగ పాడిపరిశ్రమకు కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేసింది. ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేస్తూ నిర్ణయించింది. ఈ క్రమంలో పశువులకు, కోళ్లకు నీడ, వసతి కల్పించేందుకు మళ్లీ మినీ గురుకులం పనులకు రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. పాకల నిర్మాణ పనులు మొన్నటివరకు జోరుగా జరిగాయి. బిల్లుల చెల్లింపుల్లో జరుగుతున్న జాప్యంతో ఇటీవల నెమ్మదించాయి. మండలంలో 212 మినీ గోకులం యూనిట్లు మంజూరు చేయగా.. తొలిదశలో 21 పంచాయతీలకు 74 యూనిట్లు మంజూరయ్యాయి. ఆ తర్వాత వచ్చిన దరఖాస్తులను పరిశీలించి జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధుల సిఫార్సులతో అదనంగా 65 యూనిట్లు కేటాయించారు. వీటిలో లబ్ధిదారులు ఆసక్తిచూపని కొన్ని దరఖాస్తులు రద్దు చేశారు. రెండు పశువులు ఉన్న ఒక యూనిట్‌కి రూ.1.15 లక్షలు, నాలుగు ఉంటే రూ.1.85 లక్షలు, ఆరు ఉంటే రూ.2.30 లక్షలు చొప్పున ఖర్చు చేయాలని అనుమతులిచ్చారు. ఇందులో 90 శాతం రాయితీ, పది శాతం లబ్ధిదారు వాటా చెల్లించాలి. అదే మేకలు, గొర్రెలు, కోళ్ల పెంపకందారులకు 70 శాతం రాయితీ వర్తిస్తుంది. సంక్రాంతి పండగ నాటికి పూర్తి చేయాలని అధికారులు లక్ష్యం పెట్టుకుని పనులు పూర్తి చేయించారు. అయితే బిల్లుల చెల్లింపులపై అధికారులు నిర్లక్ష్యం వహించడంతో లబ్ధిదారులు నిట్టూరుస్తున్నారు.



నందికొండ గ్రామంలో మినీగోకులం

త్వరలో చెల్లిస్తాం

మినీ గోకులం నిర్మాణాలు చాలా గ్రామాల్లో పూర్తి చేశారు. వాటన్నింటినీ రికార్డు చేశాం. మిగతా చోట్లకూడా త్వరగా పూర్తి చేయించాలని స్పష్టం చేశారు. బిల్లులు త్వరలో విడుదలయ్యేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తాం

- పార్వతి, ఏపీవో, ఉపాధి హామీ పథకం

సొమ్ముల కోసం నిరీక్షణ

మినీ గోకులం మంజూరైన పశుపోషకాలు నిర్మాణాలు పూర్తి చేసుకున్న బిల్లుల చెల్లింపుల్లో జాప్యం జరుగుతోంది. 2014-19 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం కూడా మినీ గోకులం షెడ్లను మంజూరు చేసి చాలా వరకు లబ్ధిదారులకు బిల్లులు చెల్లించకుండా చెక్కులను తిరిగి ఇచ్చిన పరిస్థితులు కూడా ప్రస్తుతం పలువురు లబ్ధిదారులు గుర్తు చేస్తున్నారు. పనులు పూర్తి చేసిన రెండు నెలల కిందట స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్ ప్రారంభించినప్పటికీ అధికారులు మాత్రం బిల్లులు చెల్లింపుపై దృష్టిసారించకపోవడంతో లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సమస్యల పరిష్కారానికే 'పల్లెనిద్ర'

- శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్

అరసవల్లి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): సమస్యలను స్వయంగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టేందుకే పల్లెనిద్ర నిర్వహిస్తున్నట్టు శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. బుధవారం రాత్రి నగరంలోని సీపన్నాయుడుపేట కమ్యూనిటీ హాల్‌లో ఆయన పల్లెనిద్ర చేశారు. అనంతరం గురువారం ఉదయం సీపన్నాయుడుపేట, ఫాజుల్‌బాగ్‌పేట ప్రాంతాల్లోని అన్ని వీధుల్లో పర్యటించి సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. అన్నివీధుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని, వేసవి దృష్ట్యా తాగునీటి సమస్యలపై దృష్టి సారించి సమస్యలు పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. వీటికి సంబంధించిన ప్రతిపాదనలు ఇప్పటికే సిద్ధం చేశామని, పనులు త్వరలోనే ప్రాంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ గణపతిరావు, రెవెన్యూ సిబ్బంది, మునిసిపల్ కమిషనర్ ప్రసాదరావు, సిబ్బంది, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శంకర్

● రానున్న ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అధికారులంతా సహకరించాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో అధికారులతో ఆయన గురువారం సమీక్ష సమీక్షించారు. రైతులకు ఎరువులు, విత్తనాలను సకాలంలో అందజేయాలని, ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో ఎరువులు, పురుగు మందులను రైతులకు అందించాలన్నారు. అలాగే నగరంలోని టౌన్‌హాలు రోడ్డులో, డే అండ్ నైట్ జంక్షన్, మునిసిపల్ కార్యాలయం వెనుక వాటర్ ట్యాంక్ సమీపంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు.

మద్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలి



రికార్డులు పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): పురుషోత్తపురం చెక్‌పోస్టు మీదుగా అక్రమంగా మద్యం, సారా, గంజాయి వంటి మాదక ద్రవ్యాలు తరలిపోకుండా అడ్డుకట్ట వేయాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం చెక్‌పోస్టును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మద్యం అక్రమంగా తరలిపోకుండా అప్రమత్తంగా ఉండడంతో పాటు ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. ఒడిశా నుంచి సారా రవాణా జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. రికార్డులు పరిశీలించి కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. నవోదయం కార్యక్రమం ద్వారా ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. పెండింగ్ కేసులు తగ్గించాలని, చార్జిషీట్ త్వరగా వేయాలన్నారు. ఎక్సైజ్ సీఐ పి.దుర్గాప్రసాద్ తదితరులు ఉన్నారు.

ఆప్కాస్‌లోనే కొనసాగించాలి



ఆందోళన చేస్తున్న కార్మికులు

అరసవల్లి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఔట్‌సోరింగ్ ఉద్యోగులను ఆప్కాస్‌లోనే కొనసాగించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె.సూరయ్య డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా గురువారం స్థానిక నగర కార్పొరేషన్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీతాలు పెంచాలని, పదవీ విరమణ వయసు 62కు పెంచాలని, అక్రమ తొలగింపులు ఆపాలని, కార్మికులకు పనిముట్లు, సెలవులు ఇవ్వాలని కోరారు. నగర పరిధికి అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ టౌన్ కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, ఏపీ మునిసిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.బలరాం, నాయకులు కె.రాజు. ఎ.శంకర్, యుగంధర్, రాజశేఖర్, చిట్టి, దేవసంతోష్, పార్వతి, మాధవి, ఈశ్వరమ్మ, మల్లెమ్మ, ఇంజనీరింగ్ నాయకులు గిరిజాశంకర్, త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీలకు సముచిత స్థానం

ఆమదాలవలస, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): టీడీపీ హయాంలో ఎస్సీలకు సముచిత స్థానం కల్పించడం ఆనందదాయకమని మాల కార్పొరేషన్ డైరెక్టర్ బోనెల అప్పారావు అన్నారు. గురువారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఎస్సీ నాయకులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ.. ఎస్సీ ఉప వర్గీకరణకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాబినెట్ ఆమోదం తెలపడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో దళిత మైనారిటీ క్రిస్టియన్ల వైస్ చైర్మన్ రాడ విజయకుమార్, తోట రాము, గుర్రాల చిన్నబాబు, గొల్లపల్లి సింహాద్రి, పొన్నాడ అప్పలసూరి, సవిరి చిన్నారావు, పెంకి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి చంద్రబాబు



సీఎంఆర్ఎఫ్ మంజూరు పత్రం అందిస్తున్న ప్రమీల

ఆమదాలవలస, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు పేదల పక్షపాతి అని మాజీ ఎంపీపీ కూన ప్రమీల అన్నారు. గురువారం తెలికిపెంట గ్రామానికి చెందిన చంచల లక్ష్మి గుండె సంబంధిత బాధపడుతుండగా, వైద్య ఖర్చుల కోసం రూ.4.5లక్షల సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన పత్రాలు ఆమెకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రమీల మాట్లాడుతూ.. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎదురుచూపులే మిగిలాయని, ప్రస్తుత ఎమ్మెల్యే రవికుమార్, నిరుపేద రోగుల బాధలను గమనించి సకాలంలో సీఎం దృష్టికి తీసుకువెళ్లి ఆర్థిక సహాయం అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ ఉపాధ్యక్షుడు నందివాడ గోవిందరావు, పార్టీ మండల అధ్యక్షుడు అంబల్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదువుకోవాలి

కవిటి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండి, క్రమశిక్షణతో చదువుకోవాలని ఎస్‌ఐ వి.రవివర్మ కోరారు. కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం సామాజిక మాధ్యమాల వల్ల కలిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు ఈగల్ బృందాన్ని పరిచయం చేసి మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవో ధనుంజయ, హెచ్‌ఎం బి.మల్లేశ్వరరావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

సోంపేట, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): కొర్లాం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని శుక్రవారం విద్యుత్ సరఫర నిలిపియేనున్నట్టు ఆ శాఖ ఈఈ జి.యజ్ఞేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బారువ, గొల్లగండి, సీహెచ్ గొల్లగండి, బారువ కొత్తూరు తదితర గ్రామాల్లో ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని, ఇందుకు వినియోగదారులు సహకరించాలని కోరారు.

● ఎచ్చెర్ల, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): పెదరావుపల్లి 11 కేవీ, కేఎస్‌పాలెం 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో చెట్ల తొలగింపు, ఇతర నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అల్లినగరం, అరిణాం అక్కివలస గ్రామాలకు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ పైడి యోగీశ్వరరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రామ్మోహన్ ఎంపికపై హర్షం

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఎకనామిక్ ఫోరం గ్లోబల్ యంగ్ లీడర్స్ జాబితాలో కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ఎంపికపై పట్టణ టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ప్రపంచ వ్యాప్తంగా ఉత్తమ నాయకత్వం, లీడర్‌షిప్‌పై రామ్మోహన్‌ను ఎంపిక చేసింది. 50దేశాల నుంచి 116 మంది ఎంపికవ్వగా అందుల్లో రామ్మోహన్ ఉండడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు.

చిత్రలేఖన పోటీలు

గార, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఆలివ్ రిడ్లీ తాబేళ్ల సంరక్షణపై పాఠశాల విద్యార్థులకి చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను మండల విద్యాశాఖ అధికారులు నక్క రామకృష్ణ, టి.వినోదిని ఆధ్వర్యంలో జరిగాయి. మండల స్థాయిలో విజేతలు 18న శ్రీకాకుళంలో జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఎంఈవో రామకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో డ్రాయింగ్ టీచర్లు, సీసీఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జైలు సందర్శన

గుజరాతీపేట, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రానికి ఆనుకుని ఉన్న అంపోలు జిల్లా జైలును సీనియర్ సివిల్ న్యాయాధికారి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు గురువారం సందర్శించారు. జైలులోని ముద్దాలు సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ఇప్పటివరకు ఎటువంటి న్యాయవాది లేని వారికి ప్రభుత్వ న్యాయవాదులు గురించి వివరిస్తూ బెయిల్ పిటిషన్లు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పరిసరాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. రానున్న జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ కావల్సిన క్రిమినల్, సివిల్ కేసులను రాజీ చేసుకోవాలన్నారు. న్యాయవాది జి.ఇందిరా ప్రసాద్, జైలర్ దివాకర్ నాయుడు తదితరులు ఉన్నారు.

తాబేళ్ల సంరక్షణపై పోటీలు

కవిటి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): తాబేలు సంరక్షణపై చిత్రలేఖన పోటీలు కవిటి ప్రభుత్వ పాఠశాలలో గురువారం నిర్వహించారు. తాబేళ్ల సంరక్షణ భవిష్యత్తు తరాలవారికి ఎంతో అవసరమని ఎంఈవో ధనుంజయ మజ్జి అన్నారు. ఈ పోటీల్లో ప్రథమ బహుమతిని జి.రోహిణి (బెలగాం), ద్వితీయ బహుమతి డి.లిఖిత (కవిటి) సంపాదించారు. బహుమతులను ఎంఈవోతో కలిసి హెచ్‌ఎం బి.మల్లేశ్వరరావు అందించారు.

ఉపాధి వేతనాలు చెల్లించాలి



మాట్లాడుతున్న సింహాచలం

అరసవల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఉపాధి వేతనాలు తక్షణమే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాపు సింహాచలం ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గురువారం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ ఏడాది జనవరి 15వ తేదీ నుంచి నేటి వరకు ఉపాధి వేతనాలు చెల్లించలేదన్నారు. ఎండనక, వాననక పనిచేస్తే వారికి జీతాలు చెల్లించకపోవడం అన్యాయమన్నారు. కార్పొరేట్ సంస్థలకు వేలాది కోట్ల రూపాయాలు రాయితీలు ఇస్తున్నారని, వేతనదారులకు మాత్రం సకాలంలో వేతనాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. తక్షణమే వేతనాలు విడుదల చేయాలన్నారు. సమావేశంలో సంఘ నాయకులు సిర్ల ప్రసాద్, కె.ఎల్లయ్య, కె.భవానీ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

సోంపేట, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈవో ఎస్.జోరాడు కోరారు. పట్టణంలోని మొగలికొత్తూరు, శివాజీనగర్ తదితర ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి తల్లిదండ్రులను కలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చిన్నారులకు పుస్తకాలు, బ్యాగులు, షూస్ ఉచితంగా అందిస్తున్నట్టు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయం చైర్‌పర్సన్ చాంబర్‌లో చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మితో కలిసి విలేకరులతో మాట్లాడారు. మున్సిపాల్టీలో తాగునీట సమస్య అధికంగా ఉందని ప్రభుత్వం పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. వంశధార నదీ జలాలును బహుదానదికి అనుసంధానం చేస్తానని ముఖ్యంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలన్నారు. వంశధార నదీ జలాలు నియోజకవర్గానికి చేరితే తాగు, సాగునీటి సమస్య పరిష్కారం అవుతుందన్నారు. కౌన్సిలర్లు సుగ్గు ప్రేమ్‌కుమార్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

రణస్థలం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రామతీర్థం జంక్షన్ వద్ద గురువారం రాత్రి సీఐ ఎం.అవతారం ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది వాహనాలు తనిఖీ చేపట్టారు. జాతీయ రహదారిపై వెళ్లే ద్విచక్రవాహనాలు, కారులను క్షుణ్ణంగా పరిశీలించారు. రాత్రి పూట మాదక ద్రవ్యాల రవాణాపై ప్రత్యేక దృష్టి సారించామని, ఇందులో భాగంగా ప్రతి వాహనం తనిఖీ చేస్తున్నట్టు సీఐ ఎం.అవతారం తెలిపారు.

విజేతగా బూరగాం స్కూల్ విద్యార్థి

కంచిలి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఆలీవ్ రిడ్లే తాబేళ్ల సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కోసం చిత్రలేఖనం పోటీలు నిర్వహించినట్టు ఎంఈవో శివరాం ప్రసాద్ తెలిపారు. మండల విద్యావనరుల కేంద్రంలో చిత్రలేఖనం పోటీలు గురువారం నిర్వహించారు. ఈ పోటీల్లో బూరగాం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి సింహాద్రి హాసినికి ప్రథమ బహుమతి, డీజీ పురం జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి ప్రత్యూషా నాయక్ ద్వితీయ బహుమతి సాధించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 చిట్టిబాబు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, సీఎంఆర్‌టీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): పురుషోత్తపురం పుష్పగిరి కొండపై గల షిర్డీసాయి మందిర వార్షికోత్సవం ఆలయ ధర్మకర్త ఉప్పాడ కృష్ణసాయి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. గురువారం వేకువ జాము నుంచే పంచామృతాలతో అభిషేకాలు, కాగడా హారతి అనంతరం బాబాకు పట్టు వస్త్రాలతో అలంకరించి పూజలు చేశారు. ఆనందాశ్రమ పీఠాధిపతి స్వామి శ్రీనివాసానంద సరస్వతి ప్రవచనాలు చేశారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా పట్టణానికి చెందిన వెంకటేశ్వర డ్యాన్స్ అండ్ మ్యూజిక్ అకాడమీ చిన్నారుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కృష్ణసాయి, సాయి భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల కల్యాణం

శ్రీకాకుళం కల్చరల్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని పుణ్యపువీధిలో ఉన్న సీతారామచంద్రమూర్తి సహిత అభయాంజనేయ స్వామి ఆలయంలో గురువారం సీతారాముల కల్యాణోత్సవం అర్చకులు నేతేటి హరిశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయధర్మకర్త ముక్కాల కొండబాబు పర్యవేక్షణలో స్వామివారి విగ్రహాలను ఊరేగించారు. కోలాటం 108 మంది మహిళలు కలశాలతో, తప్పెటగుళ్ళ, భజన పాటలతో ఊరేగింపు నిర్వహించారు. ఆలయ అర్చకులు నరసింహమూర్తి స్వామి వారికి అలంకరణ నిర్వహించారు.

● పాత శ్రీకాకుళంలో ఉన్న కల్యాణం వెంకటేశ్వరాలయం వార్షికోత్సవం గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా అన్నదానం నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బెహరా నాగేశ్వరరావు, ఎల్.నందికేశ్వరరావు, యోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పలాసకు 'ఉద్దానం' నీరు

(ఐదో పేజీ తరువాయి)

కాలేదు. దివంగత నేత కింజరాపు ఎర్రన్నాయుడు కేంద్రమంత్రి హోదాలో తీసుకువచ్చిన ఉద్దానం రక్షిత మంచినీటి పథకాన్ని మునిసిపాలిటీకి అనుసంధానిస్తే తక్కువ ఖర్చుతో నీరు ఇవ్వచ్చనే ఆలోచన రావడంతో ఎమ్మెల్యే ఆ దిశగా అధికారులను ఒప్పించారు. దీనికి సంబంధించిన సాంకేతిక అనుమతులు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వడంతో కలెక్టర్ చొరవ తీసుకొని మునిసిపాలిటీ నిధులు రూ.63 లక్షలు విడుదల చేశారు. ఈ నేపథ్యంలో పైపులైన్ల పనులు చురుగ్గా చేపడుతున్నారు. ప్రస్తుతం 900 మీటర్లకు సంబంధించి పైపులైన్ల నిర్మాణం శరవేగంతో జరుగుతోంది. ఉద్దానం రక్షిత మంచినీటి పథకం కార్యాలయం ఆవరణలో ఉన్న ఉపరితల ట్యాంకులను పైపులు అనుసంధానం చేస్తే మునిసిపాలిటీకి అదనంగా 5 ఎంఎల్‌డీ నీరు అందించవచ్చు. ఆ మేరకు అంగీకారం కుదరడంతో 15 రోజుల్లో ట్రయల్ రన్ వేయడానికి అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. మొత్తం ప్రక్రియ పూర్తయితే ఆఫ్‌షోర్ రిజర్వాయరు ఆధారిత మంచినీటి పథకం పూర్తయ్యే వరకూ మునిసిపాలిటీకి ఉద్దానం రక్షిత నీరు వినియోగపడుతుందనడంలో సందేహం లేదు.

శాశ్వతంగా నీటిని అందిస్తాం

పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీకి శాశ్వత మంచినీటి పథకం రప్పించేందుకు తీవ్ర కృషి చేస్తున్నాం. గత ప్రభుత్వం కనీసస్థాయిలో కూడా పట్టించుకోలేదు. ఉద్దానం రక్షితనీటిని ప్రజలకు అందిస్తాం, ఆఫ్‌షోర్ పూర్తయిన వెంటనే శాశ్వతంగా మంచినీటికి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక పథకాన్ని రప్పించే ఏర్పాట్లు చేస్తాం.

- గౌతు శిరీష, పలాస ఎమ్మెల్యే

15 రోజుల్లో ట్రయల్‌రన్

ఎమ్మెల్యే గౌతు శిరీష చొరవతో పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీకి ఉద్దానం రక్షిత నీటి పథకం ద్వారా నీటి కష్టాలు తీరనున్నాయి. 15 రోజుల్లో పైపులైన్లు వేసి నీరందించడానికి ట్రయల్‌రన్ నిర్వహిస్తాం. ఈ వేసవిలోనే ప్రజలకు సరిపడా తాగునీరు అందిస్తాం.

- ఎన్.రామారావు, కమిషనర్, పలాస-కాశీబుగ్గ

పాఠశాలల బలోపేతానికి చర్యలు



మాట్లాడుతున్న ఎంఈవో

ఎచ్చెర్ల, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్టు ఎంఈవోలు కారు పున్నయ్య, జి.రాజ్‌కిశోర్ తెలిపారు. ముద్దాడపేట ప్రాథమిక పాఠశాలలో గురువారం నిర్వహించిన వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న వారు మాట్లాడారు. కార్యక్రమంలో బొంతలకోడూరు జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఆనందరావు, స్థానిక ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం బొడ్డేపల్లి విజయమ్మ, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల పై విద్యార్థులకు అవగాహన

రణస్థలం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన ఉండాలని రణస్థలం అగ్నిమాపక అధికారి పైల అశోక్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా గురువారం ఎన్ఈఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో చదువుతున్న విద్యార్థులకు అగ్ని ప్రమాదలపై అవగాహన కల్పించారు. డైరెక్టర్ తేజాబాబు, ప్రిన్సిపాల్ ఊర్మిల, వైస్‌ప్రిన్సిపాల్ రాంబాబు, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

● ఇచ్ఛాపురం: అగ్నిప్రమాదాలు సంభవించేటప్పుడు అప్రమత్తంగా ఉండి మంటలను అదుపుచేయాలని ఫైర్ అధికారి కె.ప్రశాంత్ కుమార్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం బాలికల ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెచ్‌ఎం ఉపాధ్యాయులు, ఫైర్ సిబ్బంది సూర్యారావు, కామరాజు, కాశీనాథ్ పాల్గొన్నారు.

● కంచిలి: ఓ ప్రైవేట్ స్కూల్ పాఠశాలలో అగ్నిమాప సిబ్బంది నిర్వహించిన విన్యాసాలు ఆకటుకున్నాయి. గురువారం పాఠశాల ఆవరణలో సబ్బంది విన్యాసాలు చేసి అగ్నిప్రమాదాలపై డెమోద్వారా అవగాహన కల్పించారు. ఎస్ఎఫ్‌వో ఎస్.మోహన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు







ఒడిశా టు తమిళనాడు

● 10.5 కిలోల గంజాయి పట్టివేత.. ఇద్దరి అరెస్టు


మాట్లాడుతున్న సీఐ చిన్నమనాయుడు

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఒడిశాలో కొనుగోలు చేసిన గంజాయి తమిళనాడుకు తరలిస్తుండగా పట్టణ ఎస్ఐ ముకుందరావు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ మీసాల చిన్నమనాయుడు తెలిపారు. గురువారం సర్కిల్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన నరేష్ సేతీ, గోపినాథన్ తమిళనాడు రాష్ట్రం దిండిగల్ ప్రాంతంలో నివాసముంటున్నారు. అక్కడ గంజాయి వ్యాపారం చేసే లారెన్స్ ప్రధాన్‌తో వీరికి పరిచయం ఏర్పడింది. గంజాయిని తీసుకొని వస్తే కిలోకి రూ.7 వేలు ఇస్తామని చెప్పాడు. దీంతో వీరిద్దరూ ఆయన చెప్పిన విధంగా ఒడిశా వెళ్లి ఇవాల్ మజ్జి అనే వ్యక్తి వద్ద సుమారు 10.5 కిలోల గంజాయి కొనుగోలు చేసి బస్సులో ఇచ్ఛాపురం బస్టాండ్‌కు వచ్చారు. అక్కడి నుంచి తమిళనాడు వెళ్లేందుకు రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. పట్టణ ఎస్ఐ ముకుందరావు రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేపడుతూ వీరి వద్ద ఉన్న మూటలను పరిశీలించారు. గంజాయిగా గుర్తించి అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు. వారి నుంచి రెండు మొబైల్ ఫోన్లు సీజ్ చేశామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒడిశా యువకుడి మృతి

సోంపేట, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): బేసి రామచంద్రాపురం సమీపంలో హైవేపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒడిశాకు చెందిన రుద్రశెట్టి (23) మృతిచెందాడు. బారువ ఎస్ఐ హరిబాబునాయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. ఒడిశా రాష్ట్రం దిగిపొండి గ్రామానికి చెందిన రుద్రశెట్టి ద్విచక్రవాహనంపై మరో యువకుడితో కలిసి శ్రీకాకుళం నుంచి ఇచ్ఛాపురం వైపు వెళ్తుండగా అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని అవతల వైపు రోడ్డుపై పడిపోయాడు. ఇదే సమయంలో అటువైపు నుంచి వస్తున్న మరో వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సోంపేట సామాజిక ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

వంశధార ఉద్యోగి..


వెంకటరమణమూర్తి (ఫైల్)

నరసన్నపేట ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): స్థానిక మారుతీనగర్ 1వ వీధిలో నివాసం ఉంటున్న కొర్రాయి వెంకటరమణమూర్తి (51) మృతి చెందినట్లు స్థానికులు గురువారం సాయంత్రం గుర్తించారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. టెక్కలి వంశధార కార్యాలయంలో పని చేస్తున్న వెంకటరమణ మూర్తి ఇక్కడ అద్దెకు ఉంటున్నారు. అయితే ఇంటి నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు వంశధార ఉన్నతాధికారులను సంప్రదించారు. మూడు రోజుల నుంచి విధులకు రావడం లేదని వారు తెలియజేయడంతో స్థానికులు నరసన్నపేట పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎప్పుడు మృతి చెందారో తెలియరాలేదు. వెంకటరమణ భార్య 15 ఏళ్ల కిందటే మృతి చెందగా అతను ఒంటరిగానే జీవిస్తున్నారు. కుమార్తెకు వివాహం కాగా, కుమారుడు భీమిలిలోని ఒక ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్నాడు. గుండెపోటుతో మృతి చెంది ఉంటారని బంధువులు భావిస్తున్నారు. అయితే మృతికి కారణాలు తెలియరాలేదు. మృతుడి ఇంటి నుంచి దుర్వాసన వస్తుండడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. కుటుంబ సభ్యుల సమక్షంలో ఇంటిని తెరిచి దర్యాప్తు చేపడతామని ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు.

మహిళ చెవి కోసిన దుండగులు


చికిత్స పొందుతున్న సవర మల్లి

హరిపురం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): సాభకోట పంచాయతీ బిత్తర బంద గ్రామంలో సవర మల్లి అనే గిరిజన మహిళ చెవిని గుర్తుతెలియని వ్యక్తులు కోసిన ఘటన బుధవారం రాత్రి సంభవించింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. సవర మల్లి ఇంటి బయట నిద్రిస్తుండగా అర్ధరాత్రి దాటిన తరువాత గుర్తుతెలియని వ్యక్తులు కత్తితో చెవిని కోయడంతో ఆమె కేకలు వేయగా వారు పరారయ్యారు. తీవ్ర రక్తస్రావం కావడంతో వెంటనే స్థానికులు ఆటోలో హరిపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. గురువారం మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ ఘటనా ప్రదేశాన్ని పరిశీలించారు. బాధితురాలు ఎటువంటి ఆభరణాలు ధరించలేదని, గ్రామంలో పాత కక్షలతోనే ఈ దాడి జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. నిందితులను గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటు

పోలాకి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ రంజిత్‌కుమార్ తెలిపారు. గురువారం కెమెరాల ఏర్పాటును పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. నేరాల నియంత్రణకు గాను వీటిని వినియోగిస్తామన్నారు. ప్రియాగ్రహారం, గుప్పెడుపేట, బెలమర, దండులక్ష్మీపురం, వనవిష్ణుపురం, గాతలవలస కూడళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గ్రామాల్లో ఎటువంటి ఘటనలు జరిగినా వెంటనే తెలియజేయాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. 63099 90849 నెంబరుకు సమాచారం ఇవ్వాలన్నారు.

800 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

మెళియాపుట్టి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మెళియాపుట్టి మండలం ఎగువ బడే గ్రామంలో టెక్కలి ఎక్సైజ్ అధికారులు గురువారం ఆకస్మికంగా దాడులు చేశారు. ఈ దాడుల్లో 60 లీటర్ల సారా, 800 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎస్‌కె మీరాసాహెబ్ తెలిపారు. సారా తయారీదారులను గుర్తించి అరెస్ట్ చేస్తామన్నారు. బాణాపురం పంచాయతీ కార్యదర్శి పోలాకి మోహనరావు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నియంత్రణపై అవగాహన

హరిపురం ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదాల నియంత్రణపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని పలాస అగ్నిమాపక శాఖాధికారి సోమేశ్వరరావు తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా గురువారం కుంటికోట నారాయణ హైస్కూల్ ఆవరణలో అగ్నిప్రమాదం జరగకుండా జాగ్రత్తలు, ప్రమాదం జరిగిన తరువాత తీసుకోవాల్సిన చర్యలపై మాక్ డ్రిల్ నిర్వహించి వివరించారు. అగ్ని ప్రమాదాల సమయంలో స్వీయ రక్షణతో చాకచక్యంగా తప్పించుకోవాలన్నారు. ఈ సందర్భంగా అగ్ని మాపక శాఖాధికారికి పాఠశాల డైరెక్టర్ గుంట రోహిణీశంకర్ జ్ఞాపిక అందించి అభినందించారు. కార్యక్రమంలో అరవింద్, పలాస, మందస స్టేషన్ సిబ్బంది వల్లభరావు, యుగంధర్, మన్మథరావు, రాము, శంకర్, సుదర్శన్, రాజు తదితరులు పాల్గొన్నారు.



అగ్నిమాపక అధికారికి జ్ఞాపిక అందిస్తున్న రోహిణీ శంకర్

భోజన పదార్థాలు ఇలాగే ఉంటాయా?

● ఎమ్మెల్యే ఎంజీఆర్ అసంతృప్తి

పాతపట్నం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థినులకు అందించే భోజన పదార్థాలు ఇలాగే ఉంటాయా అని ప్రశ్నిస్తూ ఆహారం నాణ్యతగా లేకపోవడంపై ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అసంతృప్తి వ్యక్తం చేశారు. బొమ్మిక గిరిజన గురుకుల బాలికల ఆశ్రమ పాఠశాలను గురువారం ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భోజన నిర్వహణ దారుణంగా ఉందని, ఇది పునరావృతమైతే చర్యలు తప్పవని సిబ్బందికి హెచ్చరించారు. పాఠశాల రికార్డులను పరిశీలించారు. బోధనా ప్రమాణాలను పెంపొందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. రానున్న విద్యా సంవత్సరంలో విద్యార్థినుల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఎన్నికల హామీలను నెరవేరుస్తున్నా..

ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నానని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. తెంబూరు రోడ్డు నుంచి సింగుపురం మీదుగా రట్టిపేట గ్రామం వరకు రూ.1.60 కోట్ల ఉపాధి నిధులతో చేపట్టిన బీటీ రోడ్డును గురువారం ప్రారంభించారు. అలాగే సింగుపురంలో పశువుల దాహార్తి తీర్చేందుకు నిర్మిస్తున్న నీటితొట్టెల పనులను పరిశీలించారు. ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున పశువులకు నీరు దొరక్క ఇబ్బందులు పడుతున్నాయని, పనులను త్వరిత గతిన చేపట్టాలని సూచించారు. ప్రజా సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు నాయుడు పాలన సాగుతోందన్నారు. కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు పైల బాబ్జీ, సైలాడ సతీష్, సిరిపురం గంగాధర్, శ్రీరామ్ రమణ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.


విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

మహిళాభివృద్ధికి ప్రభుత్వ ప్రోత్సాహం

● ఎమ్మెల్యే గౌతు శిరీష

వజ్రపుకొత్తూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మహిళాభివృద్ధికి ప్రభుత్వం అనేక ప్రోత్సాహక పథకాలను అమలు చేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్మించిన రైతు ఉత్పత్తిదారుల సంస్థ కలెక్షన్ సెంటర్ (ఎఫ్‌పీవో) భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలకు ఉపాధి అవకాశాలు పెంపొందించే దిశలో గ్రామాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. పారిశ్రామికవేత్తలుగా ఎదిగిన మహిళలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. రైతు ఉత్పత్తి కేంద్రాల ద్వారా వారు పండించే పంటలను కొనుగోలు చేస్తే రైతుకు ప్రోత్సాహంగా ఉంటుందన్నారు. సమావేశంలో అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు, ఎంపీడీవో ఎస్.రమేష్‌నాయుడు, డీటీ మురళీకృష్ణ, టీడీపీ మండల అధ్యక్షుడు సూరాడ మోహనరావు, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు బర్ల సుజాత, ఏపీఎం ప్రసాదరావు, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.శశిభూషణ్, నాయకులు కర్ని రమణ, ఎ.ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

అన్నా క్యాంటీన్ ఏర్పాటుకు చర్యలు

● ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

నరసన్నపేట, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): నరసన్నపేట పట్టణంలో అన్నా క్యాంటీన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. పాతబస్టాండ్‌లో అన్నా క్యాంటీన్ ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని ఆర్డీవో సాయిప్రత్యూషతో కలిసి గురువారం పరిశీలించారు. అంతకుముందు స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో రెవెన్యూ, పంచాయతీ, ఆర్అండ్‌బీ అధికారులతో వివిధ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. రాజుల చెరువు సుందరీకరణపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో కాళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణంనాయుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బైరి భాస్కరరావు, తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో మధుసూదనరావు, మేజర్ పంచాయతీ ఈవో ద్రాక్షాయిణి, టీడీపీ నేతలు గొద్దు చిట్టిబాబు, జామి వెంకట్రావు, కింజరాపు రామారావు, సాసుపల్లి కృష్ణబాబు తదితరులు పాల్గొన్నారు.

దళితుల అభివృద్ధికి ప్రభుత్వం బాటలు

దళితుల అభివృద్ధికి ప్రభుత్వం బాటలు వేస్తోందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. ఎస్సీ కులాల రిజర్వేషన్లకు క్యాబినెట్ ఆమోదించడంతో గురువారం విలేకరులతో ఆయన మాట్లాడారు. జనాభా దామాషా మేరకు ఎస్సీ ఉప కులాలకు రిజర్వేషన్లు కల్పించి సమన్యాయం చేయడం జరిగిందన్నారు. త్వరలో విడుదల చేయనున్న డీఎస్సీ నోటిఫికేషన్‌తోనే విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు సమానంగా అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సారవకోట రామారావు, నేతలు యాగాటి లక్ష్మణరావు, ఉర్లాపు రాంబాబు, వెలుగు శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.


పాత బస్టాండ్‌లో స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, ఆర్డీవో సాయిప్రత్యూష

ఓటరు నమోదు ప్రక్రియ చేపట్టాలి

● ఆర్డీవో గ్రంధి వెంకటేష్


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో గ్రంధి వెంకటేష్

పలాసరూరల్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ప్రతి ఏటా నాలుగు పర్యాయాలు ఓటరు నమోదు ప్రక్రియ చేపట్టాలని ఆర్డీవో జి.వెంకటేష్ అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో గురువారం పలాస నియోజకవర్గ పరిధిలోని బీఎల్వోలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఏటా జనవరి, ఏప్రిల్, ఆగస్టు, డిసెంబరు నెలల్లో ఓటర్ల నమోదు చేపట్టాలన్నారు. ఎవరైనా మృతి చెందితే వారిని గుర్తించి తొలగించాలన్నారు. ఓటరు జాబితాల్లో తప్పొప్పులను సవరణ చేపట్టాలన్నారు. 18 ఏళ్లు నిండిన యువతీ యువకులను ఓటర్లుగా చేర్పించి యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్లు ఎస్.కల్యాణ చక్రవర్తి, హైమవతి, సీతారామయ్య, ఎన్నికల సూపరింటెండెంట్ వాయిలపల్లి గిరిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలతోనే సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి గణపతి

కాశీబుగ్గ, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఐక్య పోరాటాలతోనే కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం లభిస్తుందని జిల్లా కార్యదర్శి గణపతి అన్నారు. కాశీబుగ్గలో గురువారం కార్మిక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సంఘాల నాయకులు లావణ్య, నిర్మల, భూదేవి మాట్లాడుతూ.. కార్మికుల హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని విమర్శించారు. కార్పొరేట్ల లాభాలకు కార్మిక చట్టాలు ఆటంకమని భావించి వాటిని రద్దు చేసి లేబర్ కోడ్‌లను తీసుకు వచ్చాయని ఆరోపించారు. కార్మికుల హక్కుల పరిరక్షణకు ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. మే 20న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. సీఐటీయూ మండల కన్వీనర్‌గా లావణ్యతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోండి


మాట్లాడుతున్న న్యాయాధికారి మాధురి

పలాస, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని పలాస మున్సిఫ్ కోర్టు న్యాయాధికారి యు.మాధురి కోరారు. స్థానిక కోర్టు ఆవరణలో గురువారం పోలీసులు, న్యాయవాదులు, ఎక్సైజ్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మే నెల 10న నిర్వహించనున్న లోక్ అదాలత్‌లో రాజీపడదగిన సివిల్, క్రిమినల్, మనోవర్తి, చెక్‌బౌన్స్ కేసులను పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఈ దిశలో కక్షిదారులకు అవగాహన కలిగించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీపీ రమేష్, న్యాయవాదులు బీకేఆర్ పట్నాయక్, కాళిదాస్, అనిల్‌రాజు, ఎక్సైజ్ సీఐ మల్లికార్జునరావు, ఎస్ఐ ఎం.చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ మత విద్వేషాలను రెచ్చగొడుతోంది: కలమట



కొత్తూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): టీటీడీ గోశాలలో ఆవుల మృతిపై వైసీపీ ఆరోపణలు చేస్తూ మత విద్వేషాలను రెచ్చగొడుతోందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణమూర్తి విమర్శించారు. గురువారం మాతలలోని క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కోటి మంది దేవతలతో సమానంగా చూసే గోమాతలపై కూడా అసత్య ప్రచారం చేస్తూ టీటీడీ ప్రతిష్టకు భంగం కలిగిస్తున్నారని, అటువంటి వారికి పుట్టగతులుండవన్నారు. సుమారు 260 మంది ఉద్యోగులు గోవుల సంరక్షణకు పనిచేస్తున్నారని.. ఇవేవీ వైసీపీ నేతలకు కనిపించడం లేదన్నారు. టీటీడీపై అసత్య ఆరోపణలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆహారం కల్తీ కాకుండా దృష్టి సారించాలి

నరసన్నపేట, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఆహారం కల్తీ కాకుండా యువత దృష్టి సారించాలని ఆహార కల్తీ నిరోధక శాఖ జిల్లా అధికారి రత్నం, కోటబొమ్మాళి సామాజిక ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.పి.గణేష్ కోరారు. గురువారం స్థానికంగా ఒక ప్రైవేటు ఐటీఐలో ఏఐవైఎస్ 17వ జాతీయ మహాసభల సందర్భంగా కల్తీ ఆహారం నిరోధించడంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. పక్వానికి రాకుండా ఉన్న పండ్లపై రసాయనాల పిచికారీ, శీతల పానీయాలపై గడ్డఐస్ నేరుగా వేయడం వల్ల బాక్టీరియా చేరి రోగాలు సంభవిస్తాయన్నారు. వీటిని యువత గుర్తించి ప్రజలను చైతన్యం చేయాలని సూచించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు శ్రీనివాసరావు, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల బలోపేతానికి కృషి

కాశీబుగ్గ, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడులను బలోపేతం చేసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు లండ బాబూరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామ్మూర్తి కోరారు. గురువారం కాశీబుగ్గ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రాంతీయ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వాలు చేస్తున్న ప్రయోగాల వల్ల నానాటికి విద్యా వ్యవస్థ దిగజారే పరిస్థితులు ఏర్పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘం నేతలు రమేష్, ఎల్వీ చలం, టి.జయరాం పాల్గొన్నారు.

గర్భిణులకు సీమంతాలు

టెక్కలి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార పక్షోత్సవాలను నిర్వహించారు. పౌష్టికాహార ఆవశ్యకతపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో చింతాడ లక్ష్మీబాయి మాట్లాడుతూ కాయ గూరలు, ఆకుకూరలు, పండ్లు వంటి వాటిని తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు చేశారు


గర్భిణులకు సీమంతం నిర్వహిస్తున్న దృశ్యం

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

హిరమండలం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యాబోధన జరుగుతోందని జడ్పీటీసీ పి.బుచ్చిబాబు అన్నారు. గురువారం సుభలయ గ్రామంలో ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందించి తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని కోరారు.


సుభలయ గ్రామంలో ప్రచారం చేస్తున్న జడ్పీటీసీ బుచ్చిబాబు, ఉపాధ్యాయులు

21 నుంచి 23 వరకు స్పెషల్ డ్రైవ్

పాతపట్నం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించేందుకు గాను ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఎంఈవోలు తిరుమలరావు, గోవిందరాలు అన్నారు. ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం అన్ని పాఠశాలల హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు గ్రామాల్లో పర్యటించి ఇంటింటికీ వెళ్లి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా అవగాహన కలిగించాలన్నారు.

ప్రభుత్వ బడుల్లో మెరుగైన బోధన

జలుమూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడుల్లో మెరుగైన బోధన లభిస్తుందని ఎంఈవో బి.మాదవరావు అన్నారు. శ్రీముఖలింగంలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయులతో క్రమశిక్షణతో కూడిన విద్య అందిస్తున్నామన్నారు. పైసా ఖర్చు లేకుండా గుణాత్మకమైన విద్యను అందించే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో-2 ప్రసాదరావు, హెచ్‌ఎం ఎస్‌కేదాసు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మార్కులు కొలమానం కాదు

హిరమండలం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): జీవితంలో ఉన్నతంగా ఎదిగేందుకు మార్కులు కొలమానం కాదని, ప్రతిభ, పట్టుదల ఉంటే దేనిని అయినా సాధించవచ్చని కెరీర్ గైడెన్స్ అండ్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ ఎప్రశాంత్ కుమార్ అన్నారు. గురువారం స్థానిక కేజీబీవీలో ఎస్ఎస్ఏ ఆదేశాల మేరకు 'ఉజ్వల భవిష్యత్‌కు నీవే బీజం.. నీమార్కులు కాదు' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. వచ్చిన అవకాశాలను అంది పుచ్చుకుని కెరీర్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.కృష్ణవేణి పాల్గొన్నారు.



జలుమూరు: శ్రీముఖలింగంలో ర్యాలీ దృశ్యం

ఆకట్టుకున్న చిన్నారుల డ్యాన్స్

నందిగాం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈవోలు జి.నర్సింహులు, ఎ.చిన్నారావు అన్నారు. నందిగాం మెయిన్ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం గురువారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న సదుపాయాలను వివరించారు. అనంతరం చిన్నారులు చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ సభ్యులు పాల్గొన్నారు.


డ్యాన్స్ చేస్తున్న చిన్నారులు

న్యూస్ బాక్స్

1,167 మట్టి నమూనాల సేకరణ

కోటబొమ్మాళి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): రైతు సేవా కేంద్రాల పరిధిలో 1,667 మట్టి నమూనాల సేకరిస్తున్నామని వ్యవసాయాధికారి ఎస్.గోవిందరావు తెలిపారు. 'ప్రధానమంత్రి రాష్ట్రీయ కృషి వికాస్ యోజన'లో గురువారం చిట్టివలస పంచాయతీలో ఈ ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇలా సేకరించిన మట్టి నమూనాలను ఆమదాలవలస భూసార పరీక్షా కేంద్రానికి పంపనున్నామని చెప్పారు. కార్యక్రమంలో వీఏఏ టి.శ్రావణి, పలువురు రైతులు పాల్గొన్నారు.

ట్యాంకర్లతో నీటిని సరఫరా చేయాలి

పలాస, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ట్యాంకర్లతో నీటిని అందించాలని మునిసిపల్ కమిషనర్ ఎన్.రామారావు కోరారు. గురువారం కార్యాలయంలో సచివాలయ, మునిసిపల్ సిబ్బందితో తాగునీటి సరఫరాపై సమీక్షించారు. ఉద్దానం రక్షిత నీటి పథకం నీరు అందించేంత వరకూ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఏ వార్డు నుంచైనా నీటి కోసం ఫోన్ వస్తే తక్షణం స్పందించాలని సూచించారు.

కంటి శస్త్రచికిత్సలకు 62 మంది ఎంపిక

పలాస, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): స్థానిక సత్యసాయి మందిరంలో గురువారం జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. నేత్ర వైద్యాధికారి ఆర్.వెంకటరమణ 104 మందికి కంటి పరీక్షలు చేసి వారిలో 62 మందికి శస్త్రచికిత్స లకు ఎంపిక చేశారు. మందిర కన్వీనర్ ఇప్పిలి తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

లిఫ్ట్ ఇరిగేషన్‌కు స్థల పరిశీలన

సంతబొమ్మాళి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని మలగాం ప్రాంతానికి లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటుకు గాను స్థలాన్ని సంబంధిత అధికారులు గురువారం పరిశీలించారు. గరీబుల గెడ్డ ద్వారా సముద్రంలో కలిసిపోతున్న నీటిని వీరభద్రాపురం నుంచి మలగాం కాలువకు లిఫ్ట్ ద్వారా మళ్లించాలని మాజీ సర్పంచ్ బుచ్చ మురళీకృష్ణ మంత్రి అచ్చెన్నాయుడుకు విన్నవించారు. మంత్రి ఆదేశాలతో లిఫ్ట్ ఇరిగేషన్ జిల్లా కో-ఆర్డినేటర్ పి.శ్రీనివాసరావు, డీఈ ఎం.కామరాజు, ఏఈ మధు సూదన్ వీరభద్రపురం వద్ద గరీబుల గెడ్డను, వంశధార కాలువను పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చిదపాన ధర్మార్జునరెడ్డి, పలువురు రైతులు పాల్గొన్నారు.

కారు ఢీ కొని ఇద్దరికి గాయాలు

పలాసరూరల్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): రెంటికోట సమీపంలో ప్రధాన మలుపు వద్ద గురువారం రాత్రి కారు ఢీకొని ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. అల్లుకోల గ్రామానికి చెందిన వెటర్నరీ అసిస్టెంట్ రవికుమార్, భార్య సంధ్యారాణితో కలిసి బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఒడిశాకు చెందిన కారు ఢీకొట్టడంతో ఇద్దరూ గాయపడ్డారు. రాంగ్‌రూట్‌లో కారు వేగంగా వచ్చి ఢీ కొనడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ఇద్దరికి కాలికి, తలకు గాయాలు కాగా, స్థానికుల సమాచారం మేరకు 108వాహనంలో పలాస ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.